కథ

# అంతర్నెట్

- నడిమింటి జగ్గారావు

**మనవరాలు** శాంతి అమెరికా వెళ్ళడానికి అవసరమైన 'వీసా'ను తెచ్చుకోవడానికి శాంతితో పాటు కొడుకు రఘురామ్, కోడలు కనకదుర్గా మద్రాసు బయలుదేరి వెళ్ళినప్పటి నుంచి ఈశ్వరుడికి మనసు మనసులో లేదు.

'ఇంకేవుంది! మరో రెండు రోజులు! అంతే! వీసాను సాధించిన విజయగర్వంతో కొడుకూ, కోడలూ తమ కూతురితో సహా వెనక్కి వచ్చేస్తారు. ఆ తర్వాత మహా అయితే పదిహేను, ఇరవైరోజులు. ఆ తర్వాత!? శాంతి ఒఖ్ఖర్తే అమెరికా వెళ్ళే ఏదో ప్లేన్ ఎక్కి కనుమరుగైపోతుంది.'

'రఘురామ్, కనకదుర్గా వాళ్ళవాళ్ళ సర్కిల్స్‌లో తలెత్తుకుని తిరుగుతారు. తమ కూతురు తాము మసలే సంఘంలో తన పరువు నిలబెట్టిందని పట్టలేని సంతృప్తితో కొన్నాళ్ళపాటూ అడిగిన వాళ్ళకీ, అడగని వాళ్ళకీ పిలిచి మరీ గొప్పలు పోతారు. తర్వాత?! ఇద్దరూ ఉద్యోగస్తులే కనక ఎవరి హడావిడిలో వాళ్ళు పడిపోతారు. ప్రతిరోజూ కూతురి బాగోగులూ, యోగక్షేమాలూ ఇంటర్నెట్ ద్వారా తెలుసుకుంటూ ఆనందిస్తారు. ఇక మీదట వాళ్ళకి ఒకరితో ఒకరు పోట్లాడుకోడం అనే అంశం మాత్రమే కాక కూతురి అభివృద్ధిని గురించిన ఆత్రం, కుతూహలం ఎక్కువవుతాయి. వాళ్ళ జీవితానికి వాళ్ళ అభిప్రాయంలో ఒక కొత్త అర్థం పుట్టుకొస్తుంది. అంతా బాగానే వుంది! 'తనమాటేవిటి?!' అనుకున్నాడు ఈశ్వరుడు.

ఈశ్వరుడికి భార్యపోయి చాలా కాలం అయింది. రఘురామ్ ఒక్కడే కొడుకు. కోడలు వచ్చిన తర్వాత అత్యంత సహజంగా వేరింటి కాపురం గురించిన ఆలోచన గాల్లో ప్రవహించినప్పుడు, ఈశ్వరుడూ, అప్పటికింకా జీవించి వున్న అతని భార్యా చాలా స్పష్టంగా తమ అభిప్రాయం తెలియజేశారు - 'కలిసి వుండడం' అన్న ఆలోచనకి భిన్నమైన మరే ఇతర సందర్భానికి తాము అంగీకరించలేమని. భార్యమాట ఎంత సముచితంగా అన్పించినా, తల్లి దండ్రులను కాదనలేకపోయిన రఘురామ్ తామందరూ ఏ ఇబ్బందులూ లేకుండా బ్రతకడానికి అనువైన పెద్ద యింటిని అద్దెకు తీసుకున్నాడు. చిన్నతనం నుంచీ తన మాటకి ఎదురులేకుండా పెరిగిన కనకదుర్గకు అది మొట్టమొదటి ఎదురుదెబ్బ. ఆరోజే ఆమె నిర్ణయం తీసేసుకుంది. తన మాటని కాదన్న భర్తమాట ఇక మీదట ఖాతర్ చెయ్యనక్కరలేదని. 'తనేం భర్త సంపాదన మీద ఆధారపడి బ్రతికే గృహిణికాదు. తనూ ఉద్యోగం చేస్తూంది. తనకీ స్వతంత్రం వుంది. ఐనా ఒక్కమాట భర్తది చెల్లనిస్తే ఇక మిగిలిన అన్ని మాటలూ తనవే చెల్లుతాయి' అనుకున్న కనకదుర్గ ఆనాటి నుంచి తాను సర్వస్వతంత్ర సర్వసత్తాక గణతంత్ర వ్యక్తిగా మారిపోయింది.

ఈశ్వరుడు రిటైరైన తర్వాత అతనికి అపురూపంగా దొరికిన వ్యాపకం శాంతి. కొడుకూ, కోడలూ ఉద్యోగాలకి వెళ్ళిపోయాక శాంతి ఆలనా పాలనా అతనే చూసుకునేవాడు. శాంతి ప్రతిరోజూ ఈశ్వరుడి చెయ్యి పట్టుకునే స్కూలుకి వెళ్ళేది. అందరు పిల్లలూ తమ తల్లిదండ్రులతో స్కూలుకి వచ్చేవాళ్ళు. శాంతి ఒకరోజు తాతయ్యని అడిగింది -

"తాతా, తాతా, మమ్మీ,డాడీ నన్ను దింపడానికి స్కూలుకి ఎందుకురారు?" ఈశ్వరుడు అనుకున్నాడు 'నేనున్నాను కదమ్మా, అందుకు' అని. కానీ శాంతితో చెప్పాడు -

"ఏం లేదమ్మా, నేనే అడిగాను 'నా బంగారు తల్లిని నేనే స్కూలుకి దిగబెడతానూ' అని. అందుకే వాళ్ళు రావడంలేదు"

స్కూలుకి వెళ్ళేటప్పుడు శాంతి మొయ్యవలసిన పుస్తకాల భారమంతా ఈశ్వరుడే మోసేవాడు. స్కూల్ ప్రిన్సిపాల్ ఒకరోజు ఈశ్వరుణ్ని పుస్తకాల బ్యాగ్‌తో చూసింది. పక్కనే చేతులూపుకుంటూ నడుస్తున్న శాంతినీ చూసింది. చూసి కోప్పడింది -

**'ఇంకేవుంది! మరో రెండు రోజులు! అంతే! వీసాను సాధించిన విజయగర్వంతో కొడుకూ, కోడలూ తమ కూతురితో సహా వెనక్కి వచ్చేస్తారు.**

"శాంతీ, ఆర్ యు నాట్ ఎషేమ్డ్! తాతగారితో నీ బ్యాగు మోయిస్తావా? నీ చదువంతా తాతగారి కొచ్చేస్తుంది జాగ్రత్త!" శాంతి బిక్కమొహం చూసిన ఈశ్వరుడు చెప్పాడు-

"అంతకన్న అదృష్టమా సిస్టర్. ఇది చదివే పుస్తకాలు నేను చదవలేదు నా చిన్నప్పుడు. పెద్దబాలశిక్షతో మొదలైన నా చదువు ఇప్పుడీ 'వృద్ధబాలశిక్ష' చివరకు వచ్చింది"

"వృద్ధబాలశిక్షా ?" ప్రిన్సిపాల్ ఆశ్చర్యపోయింది.

"అవును. వృద్ధ బాలశిక్ష అంటే జీవితం"

శాంతి స్కూలు నుంచి వచ్చాక తాతయ్యతో కబుర్లు చెప్పేది. ప్రతిరోజూ స్కూల్లో జరిగిన సంగతులన్నీ ఈశ్వరుడితోనే పంచుకునేది. తనకి కూతురు లేని లోపం ఈ విధంగా తీరుతోందనుకునేవాడు ఈశ్వరుడు. ప్రతిరోజూ ఈశ్వరుడు చెప్పే కథలు వింటూ నిద్రలోకి జారిపోయేది శాంతి. ఈశ్వరుడు చెప్పే మంచి మంచి కథలన్నీ కలల రూపంలో అగుపించేవి. మర్నాడు స్కూల్లో లంచ్ అవర్‌లో తోటి పిల్లలకి ఆ కథలన్నీ తాతయ్య చెప్పినట్టే చెప్పేది, నాటకీయంగా. ఆ విధంగా ఈశ్వరుడు చెప్పే కథలన్నీ శాంతి ద్వారా పిల్లలందరికీ చేరిపోయేవి. కొన్నాళ్ళకి ఆ మిషనరీ స్కూల్లో చదివే పిల్లలందరికీ ఈశ్వరుడు ఎంతో ప్రియమైన క్రిస్మస్ తాతలాగా అగుపించేవాడు.

ఒకరోజు ఒక చిత్రం జరిగింది. శాంతి క్లాస్‌మేట్ తండ్రి ఒకాయన, శాంతిని స్కూల్లో దిగబెట్టి ఒంటరిగా ఇంటికి వెళ్తున్న ఈశ్వరుణ్ని దారిలో ఆపి పలకరించాడు. పరిచయాలయ్యాక అతను తన మనసులోనిమాట బయటపెట్టాడు -

"సార్. మరోలా అనుకోకండి. మీ మనవరాలు శాంతి ద్వారా మీరు చెప్పే కథలు మా అమ్మాయి వింటుంది. ఆమె ద్వారా మేమూ వింటున్నాం. పిల్లలలో మంచినీ, మానవత్వాన్నీ పెంపొందింపజేస్తూ మీరు చెప్పే నీతి కథలు విని మేమూ ఆనందిస్తున్నాం. అయితే ఈ మధ్య మా అమ్మాయి తరచుగా మమ్మల్ని సాధిస్తోంది తనకి కూడా మీలాంటి తాతయ్య కావాలని. ఈ రోజుల్లో అందరి యిళ్ళల్లోనూ ఒకరో యిద్దరో మించి పిల్లలుండడం లేదు. ఒకే పిల్ల వున్న మాలాంటి వాళ్ళ యిళ్ళల్లో తరచు వినపడే డిమాండ్ - తనకో తమ్ముడో, చెల్లెలో కావాలని. కానీ ఇలా తాతయ్య కావాలనడం అరుదు. నా రిక్వస్ట్ ఏంటంటే- మీకు వీలైనప్పుడు ఒక్కసారి మా యింటికి దయచేస్తారా? ఎందుకంటే మా అమ్మాయికి తాతయ్యలేరు. మా నాన్నగారు నా చిన్నతనంలోనే చనిపోయారు. మా మావగారు కూడా జీవించిలేరు. మీరు అన్యధా భావించకూడదు.!"

వింటున్న ఈశ్వరుడి మనసు ఆర్ద్రమైంది -

"తప్పకుండా వస్తాను బాబూ లేదా మీ అమ్మాయినే మా యింటికి పంపించండి. శాంతితో పాటూ అదీ వింటుంది. అయినా ఏం కథల్లెండి. నేను చిన్నప్పుడు చదివినవన్నీ మార్చి మార్చి చెబుతుంటాను. ముఖ్యంగా నా మనవరాలికి, తను 'ఒంటరిది' అన్న భావం రానియ్యకుండా వుంచడం కోసం ఈ తాపత్రయం" అతను మనస్ఫూర్తిగా అన్నాడు. ఆ తర్వాత ఆయన ఇంటికి వెళ్ళనూ వెళ్ళాడు. అంత వరకూ బాగానే వుంది. అంతా తెలిసి శాంతి ఈశ్వరుడి కదలికను సమర్థవంతంగా నియంత్రించింది -

"తాతా, తాతా, నువ్వు నాకే కథలు చెప్పాలి. నా ఫ్రెండ్స్వెవరికీ మా తాతయ్యలాంటి తాతయ్య ఉండకూడదు. అందరూ వాళ్ళ పేరెంట్స్ స్టాటస్ చెప్పి పోజులు కొడుతుంటారు. చూపించమను వాళ్ళకి నీ లాంటి గ్రాండ్ ఫాదర్‌ని" గర్వంగా చెబుతున్న శాంతి ముఖం ఈశ్వరుడు ఎన్ని జన్మలకీ మరిచిపోలేడు.

కోడలు కనకదుర్గకి భర్త రఘురామ్ మీద సర్వ హక్కులూ పూర్తిగా సంక్రమించే వయసొచ్చేసరికి శాంతి ఇంజనీరింగ్ చివరి సంవత్సరంలో వుంది. ఈశ్వరుడికి కూడా వృద్ధాప్య ఛాయలు ముసురుకుంటున్నాయి. ఇన్ని సంవత్సరాలూ మనవరాల్ని తన అభిరుచుల కనుగుణంగా మలుచుకుంటూ వస్తున్న ఈశ్వరుడు ఆ రాత్రి రెండు

గంటల వరకూ చదువుకుంటూ వుండిపోయిన శాంతికి తనకెంతో ఇష్టమయిన లెమన్ టీ తయారు చేసి ఇస్తూ అన్నాడు -

"చదివింది చాలమ్మా, మా అమ్మకదూ. ఇంక పడుకో. ఇంకా చదివావంటే నిద్రసరిపోదు. పొద్దున్నే లేవలేక కాలేజీకి లేటయిపోతావు. ఆరోగ్యం కూడా దెబ్బతింటుంది"

"అబ్బ, ఉండు తాతయ్యా. ముందు అర్జంటుగా ఆ 'టీ' ఇవ్వు. ఇంకా చదవవలసింది బోలెడుంది" ఈశ్వరుడి చేతిలోంచి కప్పు లాక్కుంటూ మారం చేసింది శాంతి. ఆమె టీ తాగుతుంటే ఆమెనే చూస్తూ తను కూడా ఆమె ప్రక్కనే కూర్చున్నాడు ఈశ్వరుడు -

"ఈ యేడాదితో చదువు పూర్తయిపోతుంది. తర్వాత ఏం చేస్తావు?" చదువుతున్న పుస్తకం లోంచి తలెత్తకుండా చెప్పింది శాంతి -

"ఎప్పట్నుంచో చెబుతున్నానుగా? స్టేట్స్ వెళ్ళాలి. ఎమ్మెస్ చెయ్యాలి. కెరీర్ స్టార్ట్ చెయ్యాలి. మా సీనియర్సందరూ అక్కడ నా కోసం వెయిట్ చేస్తున్నారు." వింటున్న ఈశ్వరుడి ముఖం ప్రసన్నంగా లేదు. ఏం మాట్లాడాలో తోచక యథాలాపంగా అప్రస్తుతంగా మాట్లాడాడు -

"చాలా ఖర్చవుతుందేమో! అఫ్‌కోర్స్! మీ అమ్మా నాన్నా ఆ ఖర్చు మీటవ్వడానికి ఎప్పట్నుంచో ప్లాన్ చేస్తున్నారనుకో. అయినా.....!"

"టీ చాలా బావుంది తాతయ్యా. యునో? మమ్మీకీ, డాడీకి నేను ఏమాత్రం ట్రబుల్ ఇవ్వదల్చుకోలేదు. ఈ రెండేళ్ల బట్టీ స్టేట్స్‌లో వున్న మా ఫ్రెండ్సందరితోనూ నేను నెట్ లో టచ్‌లోనే వున్నాను. దే విల్ ఫైండ్ మీ ఏ గుడ్ స్పాన్సర్. 'ఎయిడ్' ఈజీగా వచ్చే మార్గాలూ, ఆ యూనివర్సిటీలూ, ప్రొఫెసర్లూ అండ్ బ్లా.... బ్లా.... బ్లా.... ఎవ్విరిథింగ్ ఈజ్ ఎరేంజ్డ్! ఏం ప్రాబ్లమ్ లేదు. ఇనీషియల్‌గా నన్ను అమెరికా పంపిస్తే చాలు. ఆ తర్వాత నా చదువు నేను చదువుకుంటాను. ఉద్యోగం కూడా తేలిగ్గానే వస్తుంది. దెన్. ఇన్ ఎ కపుల్ ఆఫ్ ఇయర్స్.... నా మీద పెట్టిన ఖర్చంతా వడ్డీతో సహా తీర్చేస్తాను."

**ఈ రోజుల్లో అందరి యిళ్ళల్లోనూ ఒకరో యిద్దరో మించి పిల్లలుండడం లేదు. ఒకే పిల్ల వున్న మాలాంటి వాళ్ళ యిళ్ళల్లో తరచు వినపడే డిమాండ్ - తనకో తమ్ముడో, చెల్లెలో కావాలని. కానీ ఇలా తాతయ్య కావాలనడం అరుదు.**

ఈశ్వరుడు తనలో అనుకున్నాడు. 'మీ అమ్మా నాన్నా నీ మీద కేవలం డబ్బు ఖర్చుపెట్టారు. నేను!? నేను నీ చుట్టూ ఎంతో వర్తమానాన్ని నిర్మించుకున్నాను. ఎంతో అందమైన కలల్ని నీ చుట్టూ అల్లుకున్నాను. నువ్వు అమెరికా వెళ్ళడం, వాళ్ళకి స్టేటస్ సింబల్. నాకు? ఉన్న ఒక్కగానొక్క కంపెనీ చేయి జారిపోయాక నా బ్రతుక్కి అర్థం వుండదు. అయినా ఈ సెంటిమెంట్ నీకర్థం కాదు.'

"ఏం తాతయ్యా మాట్లాడవు? నేను ఇండియాలోనే 'రాట్' అవ్వాలని నువ్వు ఎక్స్‌పెక్ట్ చెయ్యవు కదా!?" సిన్సియర్‌గా అడుగుతున్న శాంతిలోని నవనవోన్మేషతని చూస్తూ బేలగా అడిగాడు ఈశ్వరుడు -

"శాంతీ! తాతయ్యని నువ్వు మిస్సవవా?" అతని గొంతు వణికిందని అతనికే తెలియలేదు.

"అఫ్‌కోర్స్. నిన్ను మిస్సవుతాను. కానీ తాతయ్యా మా తరం నాకు బోధపరచిందేవిటో తెలుసా? నేను ప్రాక్టికల్‌గా ఆలోచించాలి. సెంటిమెంట్లు పట్టుకువేలాడి భవిష్యత్తూ, నా కెరీరూ కాలరాసుకోకూడదు. నువ్వన్న మాటే నేను మా స్నేహితులతో అంటే, వాళ్ళేమన్నారో తెలుసా? -డోంట్ బి యాన్ ఇడియట్. మీ తాతయ్య ఈజ్ ఇన్ ది ఈవినింగ్ ఆఫ్ హిజ్ లైఫ్. యు ఆర్ ఎ రైజింగ్ స్టార్. నేను పై చదువులకి అమెరికా వెళ్ళనంటే మమ్మీ డాడీ బ్రతకనిస్తారా? వాళ్ళు మామూలుగా బ్రతకగలరా? ఒక్క మా మమ్మీ డాడీలే కాదు, ఇవాళ సొసైటీలో వుండే ఏ మధ్య తరగతి మనుషుల్నైనా ఈ విషయం అడగండి. అందరూ తమ పిల్లల్ని అమెరికాకో, లేక మంచి కెరీర్ వుంటుందంటే అంతరిక్షానికో పంపేయడానికి సర్వం సిద్ధంగా వున్నారు. నథింగ్ స్ట్రేంజ్" ఈశ్వరుడు నిస్తేజంగా వింటున్నాడు.

**మనవాళ్ళకి మన దేశం మనుషుల కన్నా విదేశాలు వెళ్ళి వచ్చిన వాళ్లంటేనే గౌరవం. మనదేశం వస్తువుల కన్నా, దిగుమతి చేసుకున్న వస్తువులంటేనే మోజు. మన కొబ్బరి నీళ్ళకన్నా పైదేశం నుంచి వచ్చిన కోకాకోలా అంటే యిష్టం. అమెరికాని మెచ్చుకోవడం అన్నా, ఇండియాని ఇష్టమొచ్చినట్టు తిట్టడం అన్నా మహాప్రీతి. మన దేశంలో ఆరుగంటలు పని చెయ్యలేరు. విదేశాల్లో పన్నెండు గంటలు నాన్‌స్టాప్‌గా పని చెయ్యడం యిష్టం.**

అనుకున్నట్లుగానే వారం రోజుల్లో వీసా వచ్చేసింది. ఆరోజు కొన్ని వందల ఫోన్లు! కంగ్రాట్యులేషన్స్ చెప్పేవాళ్ళూ, లోలోపల శాంతి అదృష్టానికి అసూయ పడ్డవాళ్ళూ; కనకదుర్గా, రఘురామ్‌ల కొలీగ్స్ నుంచి వచ్చే అభినందనలూ, శాంతి ఫ్రెండ్స్ గుంపులు గుంపులుగా వచ్చి శాంతితో కబుర్లూ, మరునాటి నుంచి వాళ్ళందరూ కలిసి చేసుకోవలసిన పార్టీలూ, తీసుకోవలసిన వీడ్కోళ్ళూ, చెయ్యవలసిన షాపింగూ, ఊపిరాడనివ్వనంత బిజీగా ఉండిపోయింది శాంతి.

వచ్చిన వాళ్ళందరికీ కాఫీలూ, టీలూ సప్లయి చేస్తూ, చేయిస్తూ ఆఫీసులకి సెలవులు పెట్టి మరీ తనివి తీరా ఎంజాయ్ చేశారు కనకదుర్గా రఘురామ్‌లు.

తన గదిలో కూర్చుని వున్న ఈశ్వరుణ్ని మొహమాటానికి ఒకే ఒక్కసారి పలకరించి, ఉత్తర క్షణం వాళ్ళ సంభాషణల్లో మునిగిపోయే అసంఖ్యాకమైన బంధు మిత్రుల హడావిడికి ఈశ్వరుడు తన ముఖానికి ఒక చిరునవ్వు అతికించుకుని గడిపాడు రోజంతా.

రాత్రి భోజనాలయి ఎవరి గదుల్లోకి వాళ్ళు వెళ్ళేసరికి అర్థరాత్రయింది. అలసిపోయి ఆవలిస్తూ మంచం మీద వాలిన శాంతిని చూశాడు ఈశ్వరుడు -

"శాంతీ !"

"ఏం తాతయ్యా?"

" ఇవాళ్టి నుంచీ అమెరికా వెళ్ళే ఫ్లైట్ ఎక్కే రోజు వరకూ నువ్వు బిజీ బిజీగానే వుంటావు. సే, ఇరవైరోజులు. ఈ ఇరవై రోజుల్లో ఒకే ఒక్కరోజు - జస్ట్ వన్ డే, కేవలం నాకు ఎలాట్ చెయ్యి. ఆ రోజు ఇంకెవ్వరూ వుండకూడదు. జస్ట్ నువ్వూ, నేనూ. అంతే! నాటీవెన్ యువర్ డాడ్ అండ్ మామ్. చేస్తావా?"

శాంతి విచిత్రంగా చూసింది ఈశ్వరుడి వైపు -

"ఏం తాతయ్యా. ఎనీ థింగ్ !?"

"యస్."

" ఓకే !"

తాతా మనవరాళ్ళ ఒప్పందం గురించి తెలుసుకున్న కనకదుర్గ రఘురామ్‌తో పోట్లాడింది.

"మీ నాన్నగారికి మరేం పనిలేదా! దాని బుర్ర చెడపడానికి కాకపోతే ఏమిటీ విచిత్రమైన కోరిక?"

ఆమె కంప్లైంట్ విన్న రఘురామ్ నిట్టూర్చాడు -

"పోనీలే దుర్గా, ఒక్కరోజే కదా. చిన్న విషయం. వదిలేయ్! ఒకసారి అది స్టేట్స్ వెళ్ళాక ఎలాగూ కుదరదు. పైగా మనిద్దరం లేనప్పుడు, ఇన్నేళ్ళూ దాని మంచీ చెడ్డా అన్నీ చూసుకున్నాడు కదా. యు కాన్ట్ ఇగ్నోర్ దట్ ఫ్యాక్ట్!" మరికొంత సేపు నసిగిన కనకదుర్గ ఏమనుకుందో గాని శాంతించింది.

0-0-0

ఈశ్వరుడూ, శాంతి ఊరికి దూరంగా వున్న కోవెలలో, మండపంలో కూర్చున్నారు. సాయంత్రం నాలుగ్గంటలయింది. ఉదయం నుంచీ ఈశ్వరుడు శాంతిని ఆమె చిన్నతనంలో చదువుకున్న స్కూలుకి తీసుకెళ్ళాడు, అక్కడి టీచర్లతో ఆశీస్సులు ఇప్పించాడు, ఆమె ఆడుకున్న ప్లేగ్రౌండ్‌లో ఒక అరగంట కూర్చున్నారు. ఆమె చిన్ననాటి ముచ్చట్లు ఆమెకి జ్ఞాపకం చేశాడు, తర్వాత ఆమె కాలేజీకి వెళ్ళారు, తర్వాత యూనివర్సిటీకి వెళ్ళారు. ఆమె కూర్చున్న క్లాస్ రూములూ, ఆమెకి చదువు చెప్పిన ప్రొఫెసర్లూ అక్కడే పోస్టు గ్రాడ్యుయేషన్ చేస్తున్న ఆమె క్లాస్ మేట్స్‌ని కలిశారు; తను ఆమెకి నేర్పించిన పద్యాలు ఆమెకి ఎంతవరకూ జ్ఞాపకం వున్నాయో పరీక్షించి తెలుసు కున్నాడు. దారిపొడుగునా శాంతి ఎప్పటికేనా ఇండియా వచ్చేస్తుందనీ, వస్తే మంచిదన్న తన ఆకాంక్షని బయటపెట్టాడు. తల్లీ, తండ్రీ,

బంధువులూ, మిత్రులూ, జన్మభూమీ ఉండని ఏ దూర తీరాల్లోనో బ్రతకడంలో గల ఇబ్బందుల్ని అన్యాపదేశంగా చెబుతూనే వున్నాడు; చివరగా ఆ కోవెలకి వచ్చి దర్శనం చేసుకుని మండపంలో విశ్రాంతి తీసుకుంటున్నారు తాతా, మనవరాలూ-

"ఇదంతా నీ నిర్ణయాన్ని మార్చాలనే వుద్దేశంతో చేస్తున్నది కాదు. నీ జీవితం నీ యిష్టం. ఎప్పుడైనా, భవిష్యత్తులో ఒంటరితనం నిన్ను బాధిస్తే కనీసం తలుచుకుని సేదతీరడానికి పనికొస్తాయి ఈ జ్ఞాపకాలు. నువ్వు తిరిగి ఎప్పుడు ఇండియా వస్తావో, అప్పటికి నేనుంటానో, వుండనో, కన్నవాళ్ళూ, నిన్ను పెంచిన నీ దేశం, కేవలం నిచ్చెనలే అనుకుంటున్నావేమో, ఆలోచించు. రేపక్కడ ఏ యిబ్బంది వచ్చినా నిన్ను పైకెక్కించిన ఈ నిచ్చెనలు, మళ్ళీ మాతృభూమి మీదకు దించడానికి పనికి వస్తాయి గుర్తుంచుకో. పై కెక్కిన తర్వాత, ఇక నిచ్చెనల అవసరం లేదనుకోడం పొరపాటు- ఆ మాట జ్ఞాపకం వుంచుకో."

ఈశ్వరుడు చెప్పినదంతా విని శాంతి ముఖంలో కొద్దిపాటి రంగులు మారాయి-

"ఐ కాన్ట్ హెల్ప్ ఇట్ తాతయ్యా. నేను వెళ్ళి తీరాలి. వెళ్ళడానికి నాకు బోలెడన్ని కారణాలున్నాయి, ఆశలున్నాయి, ఆశయాలున్నాయి. ఇక్కడే వుండిపోవడానికి ఇక్కడేం వుంది? నా చదువుకి తగిన ఉద్యోగం వస్తుంది. కాదనను. కానీ గుర్తింపు? మనవాళ్ళకి మన దేశం మనుషుల కన్నా విదేశాలు వెళ్ళి వచ్చిన వాళ్లంటేనే గౌరవం. మనదేశం వస్తువుల కన్నా, దిగుమతి చేసుకున్న వస్తువులంటేనే మోజు. మన కొబ్బరి నీళ్ళకన్నా పైదేశం నుంచి వచ్చిన కోకాకోలా అంటే యిష్టం. అమెరికాని మెచ్చుకోవడం అన్నా, ఇండియాని ఇష్టమొచ్చినట్టు తిట్టడం అన్నా మహాప్రీతి. 'మన దేశంలో ఆరుగంటలు పని చెయ్యలేరు. విదేశాల్లో పన్నెండు గంటలు నాన్‌స్టాప్‌గా పని చెయ్యడం యిష్టం. మన దేశంలో భద్రత ఉన్న ఉద్యోగం కన్నా తుమ్మితే వూడిపోయే విదేశపు ఉద్యోగాలంటేనే ఆకర్షణ. కట్టూ, బొట్టూ, సంస్కృతీ, సాంప్రదాయం, పురాణం, గొప్ప చరిత్రా వున్న మనదేశం కన్నా, విచ్చలవిడిగా, అతి స్వేచ్ఛగా మనుషులు మసిలే చరిత్రహీనమైన అక్కడి వాతావరణం అంటే ఆపుకోలేని మోహం, భ్రాంతి. మన రూపాయల కన్న, అక్కడి డాలర్లు ఇష్టం. ఇవన్నీ నాకు తెలీదనుకోకు, నీ శిక్షణలో, నీ అభిరుచుల్తో పెరిగిన దానిని నేను. కానీ నేను యిక్కడే వుండిపోవాలంటే యేటికి ఎదురీదడమే! ఎవ్వరూ నన్ను మెచ్చరు. నాకు తెలుసు. అందుకే నా మనస్సునీ, బాల్యాన్నీ, జ్ఞాపకాల్నీ, మమకారాల్నీ యిక్కడే పదిలంగా దాచుకుని, కేవలం శరీరాన్నీ, మేధస్సునీ మాత్రం నాతో తీసుకుపోతున్నాను. మన మేధస్సును వాడు ఎక్కువ డబ్బిచ్చి కొనుక్కుంటున్నాడు. హృదయం మాత్రం ఇక్కడే వుంటుంది. దాన్ని ఎన్ని కోట్ల డాలర్లిచ్చినా వాడు కొనలేడు. మనమూ అమ్మలేము. అక్కడికి వెళ్ళాక యీ మాటలన్నీ మరచి పోతాననీ, నిన్నూ మమ్మీని డాడీనీ శాశ్వతంగా వదిలి వెళ్ళిపోతాననీ, నేనూ అందరిలాగే విదేశీ మోజులోపడి పోతున్నానని మాత్రం అనుకోకు. నేను నేనే! ఈశ్వరుడు గారి మనవరాల్ని."

చాలా సిన్సియర్‌గా, ఒక్కోమాటనీ మాట్లాడిన శాంతి మనస్సును విన్నాక ఈశ్వరుడు ఆమెవైపు ఆశ్చర్యంగా చూశాడు. 'తాను అపురూపంగా పెంచుకున్న ఈ చిన్ని గులాబి ఎంత ఎదిగిపోయింది! తన శ్రమా, సహనం, వాత్సల్యం, ప్రేమా వృధాగా పోలేదు. శాంతి గురించిన బెంగ తనకి ఇక లేదు. ఆమెని ఏ శక్తీ మార్చలేదు. డబ్బు మీదా, యాంత్రిక జీవనం మీదా, భౌతిక ప్రపంచం మీదా ఆమెకి వున్న అభిప్రాయానికీ, సెంటిమెంట్ మీదా, జన్మభూమి మీదా, గతం మీదా, తన మీదా ఆమెకి వున్న భావుకతకీ అతను చాలా ఆనందించాడు. నెమ్మదిగా శాంతి తలను దగ్గరకు తీసుకున్నాడు. నుదుటి మీద ముద్దు పెట్టుకున్నాడు -

"చాలమ్మా, చాలు. ఈ దేశంలో పుట్టినందుకు, అసలు మనిషిగా జన్మించినందుకు పరమార్థం ఏదో నెరవేరినట్లుగా అనుకుంటున్నాను. ప్రతి యింట్లోనూ విదేశాలకి వెళ్ళే పిల్లల్ని అందరూ ఇలా కాపాడుకో గలిగితే చాలు. మనదేశానికీ, మనకీ ఏ భయమూ లేదు. ఐ యామ్ వెరీ హ్యాపీ! నువ్వు వెళ్ళాక మీ అమ్మా నాన్నా నిన్ను ఇంటర్నెట్‌లో చూసి పొంగిపోతారు. నేను నా అంతర్నేత్రంతో చూసి ఆనందిస్తాను. చాలు. ఈ జన్మకిది చాలు. గాడ్ బ్లెస్ యూ!"

శాంతి ఈశ్వరుణ్ని చిరునవ్వుతో చూస్తోంది. తనను మలిచిన శిల్పిని శిల్పం చూస్తున్నట్లుగా వుంది ఆ చూపు.